క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

లింగాల: మండలంలోని చెన్నంపల్లికి చెందిన బొగ్గు మల్లేష్ విద్యుదాఘాతంతో మృతిచెందగా, సోమవారం పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ మాకం తిర్పతయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ రూ.4వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు. లింగాల సర్పంచ్ కోనేటి తిర్పతయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పరామర్శ..

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ ఐయూబ్ కుటుంబాన్ని సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు భరత్‌ప్రసాద్ పరామర్శించారు. రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో వెంకట్, రవికుమార్ తదితరులు ఉన్నారు.

వైద్యవృత్తి దైవంతో సమానం

అమ్రాబాద్: వైద్యవృత్తి దైవంతో సమానమని ఎంపీపీ శ్రీనివాసులు అన్నారు. అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడిగా విధులు నిర్వర్తించి పదోన్నతిపై వెళ్లిన వైద్యాధికారి నాగరాజు వీడ్కోలు సమావేశాన్ని సోమవారం స్థానిక ఆస్పత్రిలో నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహన్, వైద్యాధికారి మణిప్రకాష్, రమాకాంత్, సిబ్బంది చంద్రకళ, సరిత పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

కల్వకుర్తిరూరల్: వానాకాలంలో కల్వకుర్తి, ఊరుకొండ మండలాల పరిధిలో 3లక్షల 42,375 బస్తాల ధాన్యం కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నామన్నారు. కల్వకుర్తి పట్టణంలో గోదాంతో పాటు కార్యాలయ భవన నిర్మాణం రెండు నెలల్లో పూర్తి అవుతుందన్నారు.

లక్ష్యం మేరకు పనులు చేపట్టాలి

చారకొండ: గ్రామాల్లో నర్సరీల లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండలంలోని తిమ్మాయిపల్లిలో సోమవారం నర్సరీని, పల్లె ప్రకృతివనాలను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ జాబ్ కార్డు, ఆధార్ సీడింగ్ పనులను గ్రామాల్లో పూర్తి చేయాలని ఉపాధి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేష్, ఏపీఓ వాసుదేవ్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రానున్నట్లు ఆలయ నిర్వాహకులు, నాయకులు తెలిపారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

కొల్లాపూర్: స్థానిక మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయంలో అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి.నిరూప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాలయంలో ఇంటర్ ఫస్టియర్‌తో పాటు, 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్ ఫస్టియర్ హెచ్ఈసీ, సీఈసీ కోర్సుల్లో 80 సీట్లు ఉన్నాయని, వాటిలో మైనార్టీలకు 60, బీసీలకు 10, ఎస్సీ, ఎస్టీలకు 8, ఓసీలకు 2 సీట్లు ఉన్నాయని తెలిపారు. 5వ తరగతిలో 40 సీట్లు ఉండగా, మైనార్టీలకు 30, బీసీలకు 5, ఎస్సీ, ఎస్టీలకు 4, ఓసీలకు 1 సీటు కేటాయించినట్లు వివరించారు. ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాల కోసం 7995057922 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పీఈటీల సమస్యలు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: భాషా పండితులు, పీఈటీలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని సోమవారం పీఈటీ జేఏసీ ఆధ్వర్యంలో డీఈఓ విజయ్‌కుమార్, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ సరైన విధానాలు లేక ప్రమోషన్లు కోర్టు కేసుల నేపథ్యంలో బతుకులు అధ్వానంగా మారాయని అన్నారు. పండిత పీఈటీలకు 110 జీఓ అమలు చేస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, శేఖర్‌బాబు, నిరంజన్‌యాదవ్ పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

అచ్చంపేట రూరల్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 25న బుధవారం వేలం నిర్వహించనున్నామని ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 12 వాహనాలు ఉన్నాయని, ద్విచక్ర వాహనం కోసం రూ.5వేలు, మిగతా వాహనాల కోసం రూ.20వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వేలంలో వాహనాలు రానివారికి డబ్బులు తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు డిపాజిట్ చెల్లించి అచ్చంపేట ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో నిర్వహించే వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

పోరాట యోధుడు సుభాష్ చంద్రబోస్



తాడూరు మండలం అల్లాపూర్‌లో..



కల్వకుర్తిలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం



ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలలో..



కొల్లాపూర్‌లో..



జిల్లా కేంద్రంలో..

కల్వకుర్తి: ఆజాద్ హిందుఫౌజ్ పేరుతో సైన్యాన్ని ఏర్పాటు చేసి దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం కొనియాడారు. పట్టణంలోని తిలక్‌నగర్‌లో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణయ్య, సుదర్శన్‌రెడ్డి, సూర్యప్రకాష్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు నేతాజీకి నివాళులర్పించారు.

కల్వకుర్తిరూరల్: విద్యార్థులు దేశనేతల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు రమేష్ సూచించారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సుభాష్‌చంద్రబోస్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని శ్రీవాణి విద్యానిలయంలో సోమవారం సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఇందిరాగాంధీ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు రంగినేని జగదీశ్వరుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురికి పండ్లు, బ్రెడ్లు, దుస్తులు పంపిణీ చేశారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల పాఠశాలల ఆవరణలో సోమవారం సుభాష్‌చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలో ప్రతిభ కనబర్చినవారికి హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మోహన్‌సాగర్ బహుమతులు అందజేశారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని సుద్దకల్ ప్రాథమిక పాఠశాలలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు కథల పుస్తకాలు, క్లాష్ కార్డు, చార్ట్స్ అందించారు. సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్లు క్లబ్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ తెలిపారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: బీసీ సంక్షేమ సంఘం పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. సంఘం నాయకులు సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెలకపల్లి: సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అటవీ భూములకు హక్కు పత్రాలు ఇవ్వండి



అచ్చంపేట రూరల్: అటవీ భూములు సాగు చేసుకుంటున్న ప్రతి ఒక్కరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని, పోడు భూములకు పెట్టుకున్న దరఖాస్తులను తిరస్కరిస్తే సహించేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. సోమవారం అచ్చంపేట టీఎన్‌జీఓ భవనంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 12,500 మంది పోడు భూములకు హక్కు పత్రాలు కల్పించాలని 33వేల ఎకరాల భూమికి దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. 666 ఎకరాల భూమికి పోడు హక్కు పత్రాలు ఇస్తామనడం సరికాదన్నారు. అర్హులను గుర్తించకపోవడం దారుణమన్నారు. భూమి లేని గిరిజనులకు మూడు ఎకరాల భూమి ఇస్తామన్న హామీ ఏమైందన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అంతకుముందు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో భావ ప్రకటన స్వేచ్ఛపై జరుగుతున్న దాడికి నిరసనగా మానవహారంతో నిరసన వ్యక్తం చేశారు. దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేశ్యానాయక్, గీత, ఆంజనేయులు, మల్లేష్, ఈశ్వర్, నర్సింహ, శంకర్‌నాయక్, మల్లయ్య, శివవర్మ, నిర్మల పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ భాస్కర్‌రెడ్డి

తాడూరు: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంఆర్‌సీలో నిర్వహించిన హెచ్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు తొలిమెట్టు శిక్షణలో నేర్చుకున్న అంశాలన్నింటినీ తరగతిగదిలో అమలు పర్చాలన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన నిర్వహణ, పాఠశాలలో పారిశుద్ధ్యం, విద్యార్థుల హాజరు వంటి వాటిపై శ్రద్ధ కనబర్చి విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎం తిరుపతయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సన్మానం

అచ్చంపేట రూరల్: అక్షర నిర్మాణ్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మహామేధ రాష్ట్ర స్థాయి జనరల్ నాలెడ్జ్ పోటీల్లో అచ్చంపేటకు చెందిన ఎంఎస్ఎన్ ఎక్సలెంట్ గ్రామర్ స్కూల్ 9వ తరగతి విద్యార్థి రాంప్రసాద్ ప్రతిభ చాటాడు. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి నల్లమల ప్రాంతానికి మంచి పేరు తీసుకొచ్చాడు. ఇటీవలి కాలంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పోటీలు నిర్వహించారని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, స్కూల్ చైర్మన్ సీఎం రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం స్కూల్ ఆవరణలో ప్రార్థన సమయంలో విద్యార్థిని యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు.



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ సీఎం రెడ్డి తదితరులు

ప్రశ్నించే గొంతుకను గెలిపించండి



బిజినేపల్లిలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత్‌రెడ్డి

బిజినేపల్లి: దీర్ఘకాలంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు, పండింట్ పీఈటీల వంటి సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం బలపర్చిన అభ్యర్థి భుజంగరావును గెలిపించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.పర్వత్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని నందివడ్డెమాన్, శాయిన్‌పల్లి, గంగారం, లట్టుపల్లి, వెల్గొండ, వట్టెం, బిజినేపల్లి, గురుకుల పాఠశాలల్లో పర్యటించి మొదటి ప్రాధాన్యత ఓటును భుజంగరావుకు వేయాలని కోరారు. 317 బదిలీల్లో జరిగిన వారికి స్థానికత ఇవ్వలేదని, అన్ని సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి భుజంగరావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు బాలస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మార్పణ దినోత్సవం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలు, అభిషేకాలు, కుంకుమార్చన, పల్లకీసేవ అనంతరం హోమాలు నిర్వహించి అమ్మవారిని అగ్నిగుండ ప్రవేశం చేయించారు. పూజల అనంతరం భక్తులు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ రమేష్‌బాబు, రామకృష్ణ, గోవర్దన్, జగదీశ్వర్, శ్రీధర్, రమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కందనూలు: జిల్లా కేంద్రం సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా జ్ఞాన సరస్వతి ఆలయ 12వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఆలయంలో సరస్వతీ దేవికి సామూహిక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నవీన్‌కుమార్ శర్మ మాట్లాడుతూ.. వాసవీ మాత అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవమని, అమ్మవారు శాంతించేందుకు సామూహికంగా విశేష అభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివశంకర్, నారాయణరెడ్డి, మాధవి, భూపాల్ రెడ్డి, వరలక్ష్మి, సునీత, రమాదేవి, కన్నెమ్మ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మన్ననూర్: వాసవీమాత సంఘం జిల్లా నాయకురాలు సంబు శోభ ఆధ్వర్యంలో సోమవారం ఆత్మార్పణ పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో జగతయ్య, ప్రభావతమ్మ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి

కల్వకుర్తి: పోటీ పరీక్షల కోసం ప్రతి విద్యార్థి, నిరుద్యోగి సిద్ధం కావాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని మార్కెండేయ భవన్‌లో సురేష్‌గౌడ్ రచించిన భారతరాజ్యాంగ అవలోకనం, రాజకీయాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో చదువుకునే వారికే కాకుండా రాజకీయాల్లో ఉన్నవారికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి పుస్తకాలు మరెన్నో రావాలని కోరారు. జాతీయ బీసీ కమీషన్ మాజీ చైర్మన్ ఆచారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజిసింగ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు భరత్‌ప్రసాద్, విజిలెన్స్ సీఐ చరమందరాజు పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు



లింగాల: సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువవుతుంది. సోమవారం మండల ప్రత్యేకాధికారి, డీపీఓ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు ప్రజల నుంచి దరఖాస్తుల కోసం ఎదురుచూడక తప్పలేదు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, డీటీ ముబినాబేగం, ఏఓ నాగార్జునరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఐకేపీ రవి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని అరికట్టాలి



అమ్రాబాద్: బావ ప్రకటనా స్వేచ్ఛ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అమ్రాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పౌరులకు ఉన్న బావ ప్రకటన స్వేచ్ఛను మతోన్మాదులు అణిచి వేస్తున్నారని విమర్శించారు. బైరి నరేష్, రెంజర్ల రాజేష్, ఉపాధ్యాయుడు మల్లికార్జున్, నర్సింహలపై మతోన్మాదుల దాడేనని, మతోన్మాదాన్ని అరికట్టి ప్రజాస్వామ్య లౌకిక వాదాన్ని, బావ ప్రకటనా స్వేచ్ఛను కొనసాగించాలని వివరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాసరయ్య, బాలకిష్టయ్య, మోహన్, గోపాల్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా భారతి సిమెంట్ వారి సౌజన్యంతో ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేయడం ఎంతో గొప్పవరమని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కొండల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సతీష్, డీలర్ కర్ణాకర్‌రెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్, ఆలయ ధర్మకర్తలు గోపి, శ్రీనివాస్‌గౌడ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



అచ్చంపేట రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, రింగ్‌బాల్, స్కిప్పింగ్, కుర్చీలాట, రన్నింగ్, క్యారమ్‌బోర్డు, క్రికెట్, చెంచాగోళి వంటి ఆటలను ఆడించారు. అలాగే పిరమిడ్ ఆకారాలను, జాతీయ నాయకుల వేషధారణలు, పాటలను విద్యార్థులు రిహార్సల్ చేశారు.

బీటీ రోడ్డు మంజూరుకు వినతి

వెల్దండ: మండలంలోని నారాయణపూర్ నుంచి చెర్కూర్ వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని సోమవారం మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్ తదితరులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారికి సమీపంలో ఉన్న నారాయణపూర్‌కు బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా చెర్కూర్ సమీపంలోని వాగుపై బ్రిడ్జి నిర్మించాలన్నారు. వచ్చే నెలలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తామని ఎమ్మెల్యే వివరించారన్నారు. కార్యక్రమంలో జైపాల్‌నాయక్, నాగయ్యగౌడ్, గోపాల్, టాక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహాసభలను జయప్రదం చేయండి

కందనూలు: టీయూడబ్ల్యూజే–హెచ్ 143 జర్నలిస్టు సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ద్వితీయ మహాసభలను జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 5న జిల్లా కేంద్రంలోని రూబీ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లాఖాన్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలకు మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణతో పాటు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. మహాసభలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు దినకర్ రావు, సురేష్, శేఖరాచారి, చంద్రశేఖర్ రావ్, ఉమాశంకర్, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జర్నలిస్టులు

పరీక్షలంటే భయం వీడాలి

కొల్లాపూర్: విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని వీడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సూచించారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఎగ్జామ్ వారియర్స్ ఆర్ట్ కాంపిటీషన్ కార్యక్రమం సోమవారం కొల్లాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు కార్యక్రమానికి హాజరై ఆర్ట్ కాంపిటీషన్‌లో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అంతకు ముందు సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణగౌడ్, భరత్‌చంద్ర, పరశురాముడు, శివకృష్ణయాదవ్, రమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోండి

లింగాల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారు. లింగాల సీహెచ్‌సీలో 105 మందికి కంటి పరీక్షలు చేయగా, 25 మందికి కళ్లద్దాలను పంపిణీ చేసినట్లు వైద్యాధికారి బిక్కునాయక్ తెలిపారు. అంబట్‌పల్లి పీహెచ్‌సీలో 187 మందిని పరీక్షించి 57 మందికి కళ్లఅద్దాలు, 47 మందికి కళ్లకు సంబంధించిన మందులను అందజేసినట్లు వైద్యాధికారి సంతోష్ తెలిపారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ పాఠశాలలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం మూడో రోజు కొనసాగుతుంది. గత 3రోజులుగా పెంట్లవెల్లిలో 401 మందికి చికిత్సలు నిర్వహించి 128 మందికి అద్దాలు పంపిణీ చేశారు. మరో 139 మందికి కావాల్సిన అద్దాలు ఆర్డర్ చేసినట్లు క్యాంపు ఆఫీసర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దకార్పాములలో కంటి వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. పెద్దకొత్తపల్లిలో 531 మంది, పెద్దకార్పాములలో 560 మందికి కంటివైద్య పరీక్షలు నిర్వహించారు. వెనచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 405, ఆదిరాలలో 437 మందికి, చంద్రకల్‌లో 162 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు గుంతకోడూరులో ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమం సోమవారం కొనసాగింది. అద్దాల పంపిణీ, ఆపరేషన్ కోసం 6మందిని ఎంపిక చేసినట్లు మండల వైద్యాధికారి సంతోష్‌అభిరాం తెలిపారు. సర్పంచ్ మాదవి కంటి వెలుగు శిబిరం వద్ద రంగురంగుల ముగ్గులు వేసి కంటి వెలుగుపై అవగాహన కల్పించారు.



పెద్దకార్పాములలో అద్దాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి